అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 22 మే 2023
1

పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తనపై పోలీసులు అక్రమంగా కేసులు పెడుతున్నారని ఓ యువకుడు ఆదివారం రాత్రి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్ కాలనీకి చెందిన రోహిత్ షిండే తనపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన ఎదుట పురుగులమందు తీసుకువచ్చి తాగేందుకు ప్రయత్నించగా తోటి మిత్రులు పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం కాసేపటి తరువాత మళ్లీ పెట్రోల్ తీసుకొని తనపై పోసుకున్నాడు. వెంటనే మిత్రులు అడ్డుకున్నారు. తనపై నీళ్లు పోశారు. అనంతరం అతడిని మిత్రులు రిమ్స్‌కు తరలించారు.

సంక్షేమ పథకాలతో దేశంలోనే రాష్ట్రం ముందంజ

నవతెలంగాణ-నస్పూర్

సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే రాష్ట్రం ముందంజలో ఉందని, కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నారని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. ఆదివారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లపెల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీ డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలు వారి దృష్టికి తీసుకురాగా సింగరేణి యాజమాన్యం, మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఇసంపల్లి ప్రభాకర్, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కౌన్సిలర్లు వంగ తిరుపతి, పట్టణ ఉపాధ్యక్షులు సంతోష్ చారి, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, 12వ వార్డు అధ్యక్షుడు రవి గౌడ్ పాల్గొన్నారు.

పరిహారం జాడేదీ..?

అకాల వర్షాలు.. వడగండ్ల వర్షానికి పంటలు నష్టపోయిన అన్నదాతలకు చెల్లించాల్సిన నష్ట పరిహారం జాడలేకుండా పోయింది. వ్యవసాయశాఖ అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నష్టం వివరాలను నివేదిక రూపంలో పంపించినా పరిహారం నిధులు విడుదలలో జాప్యం జరుగుతోంది. నష్ట పరిహారం డబ్బులను ఈ నెల 12వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఈ గడువు ముగిసిపోయి వారం రోజులు గడుస్తున్నా పరిహారం పత్తా లేకుండా పోయింది.మరోపక్క మార్చిలో కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులకు అందజేసేందుకు ప్రభుత్వం రూ.కోటి నిధులను విడుదల చేసింది. కానీ ఈ నిధులు ట్రెజరీలోనే నిలిచిపోవడంతో రైతులకు సాయం దక్కడం లేదు. మలి విడత వర్షాలకు నష్టపోయిన పంటలకు కూడా నష్ట పరిహారం కూడా అందజేస్తామని సర్కారు ప్రకటించినా కార్యరూపం దాల్చడం లేదు. రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో ఆర్థిక సాయం అందుతుందా లేదా అనేది అనుమానంగామ మారుతోంది.

- కర్షకుల దరి చేరని పంట నష్టం డబ్బులు
- సర్వే నివేదిక అందజేసినా ప్రభుత్వం కాలయాపన
- విడుదలైన రూ.కోటి నిధులనూ పంపిణీ చేయని వైనం
- ఆర్థిక భరోసా కోసం అన్నదాతల ఎదురుచూపులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఎండలు ముదిరే సమయంలో అకాల వర్షాలు అన్నదాతలను నిండా ముంచాయి. ఖరీఫ్ కాలంలో నష్టపోయిన పంటను రబీలో భర్తీ చేస్తామని ఆశపడిన కర్షకులకు మరోసారి నిరాశ ఎదురైంది. ఎండల ప్రభావం ఉండే మార్చి మూడో వారంలోనూ వానలు దంచికొట్టడం.. ఈదురుగాలులు, వడగండ్ల వర్షానికి మొక్క.జొన్న, జొన్న, మిర్చి, ఇతరాత్ర కూరగాయల పంటలన్ని తీవ్రంగా దెబ్బతిన్నాయి. రబీ సాగుపై అనేక ఆశలు పెట్టుకున్న అన్నదాతలకు తీవ్ర ఆర్థిక నష్టాన్ని మిగిల్చాయి. స్పందించి ప్రభుత్వం పంట నష్టం సర్వే చేయాలని ఆయా జిల్లాల అధికారులను ఆదేశించింది. మరోపక్క ఇదే ఏడాది ఏప్రిల్ రెండో వారంలోనూ అదే రీతిన వడగండ్ల వర్షాలు భీభత్సం సృష్టించాయి. దీంతో పంటలన్ని నేలకూలి తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ రెండు విడతల్లో నష్టపోయిన రైతులందరికీ ఎకరానికి రూ.10వేల చొప్పున సాయం అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కౌలు రైతులకు కూడా ఈ సాయం వర్తిస్తుందని పేర్కొంది. మరో పక్షం రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావస్తున్నా ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం జాడ లేకుండా పోయింది.

విడుదలైన నిధులకు మోక్షం లేదు

ఆదిలాబాద్ జిల్లాలో మార్చిలో కురిసిన వర్షాలకు 732మంది రైతులకు సంబంధించి 1004 ఎకరాలు, ఏప్రిల్ కురిసిన వర్షాలకు మరో 1500 ఎకరాల వరకు నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. మిగితా నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలోనూ ఇదే స్థాయిలో నష్టం జరిగినట్లు తెలిసింది. ప్రభుత్వ సూచన మేరకు క్షేత్రస్థాయిలో సర్వే చేసిన అధికారులు నష్ట పోయిన రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదించారు. తొలి విడత మార్చిలో నష్టపోయిన రైతులకు సంబంధించి ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాకు రూ.కోటి నిధులు విడుదల చేసింది. కానీ ఈ నిధులు సైతం ట్రెజరీలోనే నిలిచిపోవడంతో రైతుల దరికి చేరడం లేదు. ఏప్రిల్ నెలలో కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులకు కూడా త్వరలోనే పరిహారం అందజేస్తామని చెప్పినప్పటికీ..రోజుల తరబడి కాలయాపన జరుగుతోంది. ప్రభుత్వ ఖజానాలో నిధుల కొరత కారణంగానే పరిహారం విడుదలలో జాప్యం జరుగుతోందనే ప్రచారం జరుగుతోంది. రైతులు మాత్రం పరిహారం డబ్బులు వస్తే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులు, తదితర వాటిని కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుందని ఆశతో ఉన్నారు.

రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలి



బొర్రన్న, రైతు స్వరాజ్యవేదిక అధ్యక్షుడు

జిల్లాలో వడగండ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం పరిహారం అందజేస్తామని ప్రకటించింది. రూ.కోటి నిధులు కూడా విడుదల చేశామని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ నిధులు ట్రెజరీలో ఉన్నప్పటికీ రైతుల దరికి చేరకపోవడం శోచనీయం. ఖజానాలో డబ్బులు లేకపోవడంతోనే ఈ సమస్య తలెత్తినట్లు తెలిసింది. ప్రభుత్వం వెంటనే పరిహారం అందజేసి అన్నదాతలకు ఆర్థిక భరోసా కల్పించాలి.

త్వరగా అందజేసి ఆదుకోవాలి



కల్లెం భోజన్న, కుమారి, రైతు

గ్రామంలో మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. వడగండ్ల వర్షం తీవ్రతకు పంటంతా నేలపాలైంది. అధికారులు సర్వే కూడా చేశారు. కానీ ఇంత వరకు పరిహారం డబ్బులు రావడం లేదు. ప్రభుత్వం త్వరగా అందజేస్తే ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల కొనుగోలుకు ఉపయోగపడుతాయి.

అంతర్జాతీయ క్రీడాకారునికి సన్మానం



నవతెలంగాణ-మందమర్రి

రష్యా దేశంలోని మాస్కో నగరంలో ఈ నెలలో 1 నుండి 5వ తేదీలలో నిర్వహించిన అంతర్జాతీయ వూషఉ (మార్షల్ ఆర్ట్స్) పోటీలలో మంచిర్యాల జిల్లా క్రీడాకారుడు మటూరి శివమహేష్ పాల్గొని కాంస్య పతకం సాధించిన సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం మందమర్రి పట్టణంలోని సింగరేణి మహిళ డిగ్రీ కళాశాలలో శివమహేష్‌ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పులిపాక మోహన్ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవటం వల్ల క్రీడాకారులు మానసికంగా శారీరికంగా ధృఢంగా ఉండటమే కాకుండా ఆత్మరక్షనకి, చక్కని ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది అన్నారు. అలాగే జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనటం ద్వారా వొచ్చే సర్టిఫికెట్స్ కేంద్రప్రభుత్వం నుంచి వెలువడే ఉద్యోగాలకు స్పోర్ట్స్ కోటా కింద రిజర్వేషన్లు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ కోశాధికారి రంగు శ్రీనివాస్, జిల్లా మాస్టర్స్, మూషిని వెంకటేష్, కర్ర వెంకటేష్, సర్రేష్, నాగలక్మి ప్రసాద్, నవీన్ పాల్గొన్నారు.

సేవలను మరింత విస్తృతం చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో న్యూట్రిషన్ ఫ్లస్ సేవలను మరింత విస్తృతం చేయాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ సూచించారు. స్థానిక మార్కెట్ ఏరియాలో ఆదివారం న్యూట్రిషన్ ఫ్లస్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. టౌన్ సీఐ బుద్దె స్వామితో కలిసి డీఎస్పీ ఈ కేంద్రాన్ని సందర్శించారు. వారు స్వయంగా ప్రజలకు మజ్జిగ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున మార్కెట్‌కు వచ్చే ప్రజల సౌకర్యార్థం మజ్జిగ పంపిణీ చేసి వారి దాహార్తిని తీర్చడం మంచి కార్యక్రమమని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ సుమిత్ పాల్గొన్నారు.

తునికాకు కూలీ కుటుంబాన్ని ఆదుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన తునికాకు సేకరణ కూలీ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నేర్పల్లి అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం తునికాకు సేకరణ ప్రారంభం కావడంతో ఆదివాసీలు, ఇతరులు అధిక సంఖ్యలో అడవులకు వెళ తున్నారని, అటవీ శాఖ కూలీలు ప్రమాదాల బారిన పడకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అడవి జంతువుల నుండి రక్షణ కల్పించడమే కాకుండా, ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి హెచ్చరిక బోర్డులను అమర్చాలని సూచించారు. అటవీ ప్రాంతం గుండా వెళుతున్న విద్యుత్ తీగలను సూచించే బోర్డులను ఏర్పాటు చేస్తే వేమనపల్లిలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని పేర్కొన్నారు. మృతి చెందిన కూలీ ఆసుపత్రి ఖర్చులను ప్రభుత్వమే భరిస్తూ, ఆ కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

మహర్ కులస్తులు ఐక్యం కావాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాష్ట్రవ్యాప్తంగా మహర్ కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ఐక్యంగా ఉండాలని మహార్ సంఘం రాష్ట్ర వ్యవస్థాపకుడు జాడే దీపక్ అన్నారు. శనివారం రాత్రి జక్కాపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడి ఉన్నారని, అగ్ర కులస్తుల నాయకులు నాటి నుండి నేటి వరకు అణచివేసే ధోరణి ఉండడమే ప్రధాన కారణమని అన్నారు. మహార్ కులస్తులు దీనిని దృష్టిలో ఉంచుకొని అన్ని రకాలుగా అభివృద్ధి సాధించాలంటే ఐక్యమై పోరాటం చేయాల్సి ఉంటుందన్నారు. మహర్ కులస్తులకు గత ప్రభుత్వాలు మహర్ కులం పేరుతో కుల ధృవీకరణ పత్రం ఇచ్చేవారని, నేటి ప్రభుత్వాలు మహర్ కులస్తులకు ఆ కులానికి సంబంధించిన సర్టిఫికేట్ ఇవ్వకుండా మాల అని ఇస్తున్నారని పేర్కొన్నారు. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా మహర్ కులస్తులు ప్రభుత్వం అందించే ఫలాలు అందాలంటే ఐక్యమై పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మహర్‌లు ఐక్యంగా లేకుండా విడదీశారని, ఇది ప్రతి ఒక మహర్ కులస్తులు గమనించి, మహర్‌ల చరిత్రలోనే రాజులు, యుద్ధ వీరులు మొదటి ప్రపంచ యుద్ధంలోనే మహర్ సైన్యం ఉండేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు మహర్ చరిత్ర తెలుసుకొని మహర్‌కుల ధృవీకరణ పత్రం ఇవ్వాలని, త్వరలో తెలంగాణ రాష్ట్రంలో కమిటీలు వేసి మహర్‌లను బలోపేతం చేస్తామని, దీని కోసం ప్రతిఒక మహర్ కులస్తులు బాధ్యతగా ఉద్యమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో దుర్కె బాపూజీ, డోంగ్రి రవీందర్, డోంగ్రి కార్తీక్, పిప్రె చందు, గ్రామ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

వరిధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలి

నవతెలంగాణ-దహెగాం

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకురావాలని డీసీఓ తారామణి అన్నారు. ఆదివారం మండలకేంద్రంతో పాటు లగ్గాం, ఒడ్డుగూడ, కొంచవెల్లి తదితర వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిధాన్యాన్ని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్యాంలాల్, శ్రీనివాస్, సీఈఓ బక్కయ్య, సెంటర్ ఇన్‌చార్జీలు నారాయణ, జీవన్, సాయి పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

నవతెలంగాణ-కౌటాల



అత్యవసర పరిస్తితిలో గర్భిణీని ఆస్పత్రికి తరలిస్తుండగా ఆదివారం 108 అంబులెన్స్‌లోనే ప్రసవించింది. ఈఎన్‌టీ పిట్టల విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమిని మండలంలోని బోర్లకుంట గ్రామానికి చెందిన అస్నాబేగం భర్త శెనీషేక్‌తో కలిసి కౌటాల మండలంలోని తాటిపెల్లి గ్రామంలోని ఓ శు భకార్యానికి వచ్చారు. పురుటి నొప్పులు అధికం కావడంతో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్స్ అక్కడికి చేరుకొని గర్భిణీని ఆస్పత్రికి తరళిస్తుండగా తాటిపెల్లి, కౌటాల మార్గమధ్యలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఇది మూడో కాన్పు. తల్లి, బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారని ఈఎన్‌టీ తెలిపారు. పైలెట్ ఆసిఫ్ ఉన్నారు.

సమ సమాజ స్థాపనలో అంబేద్కర్ కృషి ఆదర్శనీయం

- ఎమ్మెల్యే ఆత్రం సక్కు
- జనకాపూర్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాజ్యాంగ నిర్మాత, దళిత వర్గాల ఆశాజ్యోతి డా.బీఆర్.అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శనీయమని సమ సమాజ స్థాపనలో ఆయన కృషి వెలకట్టలేనిదని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగేశ్వరరావుతో కలిసి హాజరయ్యారు. అంతకుముందు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఏ మతానికి జాతికి చెందిన వ్యక్తి కాదని, సమాజ హితం కొరకు పాటుపడిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ఆర్థిక వేత్తగా, న్యాయవాదిగా, గొప్ప సంఘ సంస్కర్తగానే గాక ఆర్థికంగా స్వయం ప్రతిపత్తి కొరకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారని, అంటరానితనం నేరంగా పరిగణించినట్లు తెలిపారు. విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని, పిల్లలకు ఇవ్వాల్సింది ఆస్తులు కాదని, విద్య ఇవ్వాలని చాటి చెప్పారని తెలిపారు. అంబేద్కర్ దళితులకు అందించిన రిజర్వేషన్ల ప్రక్రియ దళిత వర్గాల ప్రజలను ఉన్నత స్థానంలో నిలిపిందన్నారు. మన దేశం గొప్ప ప్రజాస్వామ్య, గణతంత్ర, లౌకిక రాజ్యంగా వర్ధిల్లడం ఆ మహనీయుని కృషి అని అన్నారు. దళిత బంధు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో 77 యూనిట్లు మంజూరు చేయడం జరిగిందని, లబ్ధి పొందిన దళిత కుటుంబాలు వారు ఎంచుకున్న వ్యాపార యూనిట్లను సమర్ధవంతంగా నిర్వహించి ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. జడ్పీ చైర్పర్సన్ కోవలక్ష్మి కార్యక్రమం అనంతరం వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, వైస్ ఎంపీపీ సుంకరమంగ పెంటయ్య, నాయకులు అబ్దుల్లా, అంబేద్కర్ సెంటర్ కమిటీ జిల్లా అధ్యక్షుడు బాపు జాడే, నిర్వాహన కమిటీ సభ్యులు రేగుంట కేశవ్, అశోక్ మహల్కార్, ముంజం సాంబయ్య, మనోహర్, సుభాష్, తుకారం, హేమంత్ షిండే పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో సంయుక్త తనిఖీలు

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని ఫర్టిలైజర్ షాపులలో ఆదివారం వ్యవసాయ టాస్క్ ఫోర్స్, పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. నకిలీ విత్తనాలను అరికట్టడంలో భాగంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన దుకాణాలను గోడౌలను తనిఖీ చేశారు. విత్తనాల లైసెన్స్, స్టాక్ రిజిస్టర్లు బిల్ పుస్తకాల లను పరిశీలించారు . విత్తనాల నాణ్యత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ కమిషనర్ కార్యాలయ ఏడీఏ తిరుపతి మాట్లాడుతూ రైతులకు ఫర్టిలైజర్ షాప్ యజమానులు విత్తనాలు అమ్మేటప్పుడు సంబంధిత విత్తనాల కంపెనీ లాట్ నెంబర్ విత్తన తయారు తేదీ తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. రైతులకు సంతకంతో కూడిన రసీదు ఇవ్వాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు మొలక శాతాన్ని తయారు తేదీని గమనించాలని సూచించారు. విత్తన దుకాణాల యజమానులు ఎవరైన గడువు తీరిన, ముగిసిన విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా హెచ్చరించారు. రైతులు ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలను కొనుగోలు చేయరాదన్నారు. ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలను కొనుగోలు చేసి నష్టపోయినట్లయితే ప్రభుత్వం బాధ్యత వహించదన్నారు. రైతులకు లైసెన్స్ కలిగిన నాణ్యతమైన విత్తనాలను అందించాలని కోరారు. నకిలీ విత్తనాలను పురుగుల మందులను అమ్మితే లైసెన్సులు రద్దు చేస్తావమని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ అధికారి కిరణ్‌మై టాస్కోర్స్ సీఐ అశోక్, లచ్చన్న సీడ్ సర్టిఫికెట్ ఆఫీసర్ శంకరయ్య ఉన్నారు.



విత్తన దుకాణాల గోడౌలను తనిఖీ చేస్తున్న అధికారులు

భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు నిరంతరం చదవాలని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలకేంద్రానికి చెందిన సీహెచ్ రాణి 9.5, నేరెళ్ల ఏంజెల్ 8.5 జీపీలను సాధించారు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థులను శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత రాణించాలన్నారు. భారతదేశంలో స్త్రీలకు విద్యను అందించిన సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని ఆమె ఆశయాలను కొనసాగించాలన్నారు. బాలికలు బాలురు కంటే తక్కువేమీ కాదని, వారితో పోటీపడి చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ఇప్ప రవిశంకర్ పాల్గొన్నారు.

ఒంటికాలిపై వీఓఏల నిరసన



నవతెలంగాణ-కౌటాల

వీఓఏల సమస్యలు పరిష్కరించాలని తలపెట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 35వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఓఏల సమస్యలు పరిష్కరించాలని మండుటెండలో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా సీఐటీయూ జిల్లా నాయకుడు కృష్ణమాచారి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం సెలవు కావడంతో ఐకేపీ కార్యాలయానికి తాళం వేసి ఉన్నందున కార్యాలయం గేటు ముందు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపి వీఓఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చేంతవరకు సమ్మె విరమించేదిలేదని హెచ్చరించారు. వారి సమస్యలు పరిష్కారమయ్యే వరకు సీఐటీయూ నాయకులు వారికి అండగా ఉంటారని స్పష్టం చేశారు. ప్రభుత్వం దిగివచ్చి న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెలో ఐకేపీ మండల కోశాధికారి గోగర్ల మహేశ్వరి, పాలె పద్మ, కొట్రంగి ప్రతిభ, భీమయ్య, వడాయి కొండయ్య పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీ పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-జన్నారం

హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహైల్ షా తెలిపారు. ఆదివారం క్విజ్ కు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఆదేశాల మేరకు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 60 మార్కులతో కూడిన ప్రశ్నలకు సమాదానాలు రాయాల్సి ఉంటుందని తెలిపారు. నియోజకవర్గాల వారిగా మంచి ప్రతిభ కనబరిచిన 44 మందికి బహుమతులను అందించనున్నట్లు వివరించారు. మొదటి బహుమతి కింద మహిళలకు చార్జింగ్ స్కూటీ, అబ్బాయిలకు ల్యాప్ టాప్, ఇతర బహుమతులు ఇస్తామన్నారు. 7661899899 నంబరుకు మిస్ కాల్ ఇచ్చినట్లయితే రిజిస్ట్రేషన్ లింక్ మొబైలుకు వస్తుందని, అందులో వివరాలు నమోదు చేసి 0046 రెఫరల్ కోడ్‌ను నమోదు చేయాలన్నారు. జూన్ 2న పరీక్ష ఉంటుందన్న ఆయన జూన్ 1 లోగా రెజిస్ట్రేషన్ చేసుకుకోవాలని సూచించారు.

కాసిపేట : రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్‌ను యువత అందరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేములకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రం లో క్విజ్ పోటీలకు సంబందించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రియాంక గాంధీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా టీపీసీసీ తలపెట్టిన రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో కాసిపేట మండల యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ క్విజ్ పోటీ పరీక్ష జూన్ 2న ఉదయం 10 గంటలకు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సిద్ధం తిరుపతి, ఎంపీటీసీ భీంరావు, ఉప సర్పంచ్ కనుకుల రాకేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, నాయకులు కొత్త రమేష్, షకీర్, మహంకాళి, జాడి శివ, వెంకటేష్, చిలుకయ్య పాల్గొన్నారు.

పంచాయతీల్లో ప్రత్యేక కార్యక్రమాలు

నవతెలంగాణ-తాండూర్

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ మండలంలోని కిష్టంపేట, కాసిపేట బోయపలి గ్రామ పంచాయితీలో ఆకస్మిక తనిఖీ చేశారు. పారిశుధ్య పనులను చేపట్టి చెత్తను కంపోస్ట్ షెడ్‌కు తరలించాలని, పారిశుధ్య కార్యక్రమంలో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. నర్సరీ, వైకుంటదామం, కంపోస్ట్ షెడ్‌లను పరిశిలించి నిర్వహణ సరిగా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎం.సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శులు చంద్రమౌళి, సాయితేజ, కలపన పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- నేతకాని మహర్ సంఘం రాష్ట్ర నాయకులు గోళ్ళ రాజమల్లు

నవతెలంగాణ-దండేపల్లి

బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నదిపై అసత్య ఆరోపణలు చేస్తూ వ్యక్తిగతంగా దాడులు చేస్తున్న వారిపై చట్టయితే చర్యలు తీసుకోవాలని కోరుతూ నేతలను మహార్ సంఘం నాయకులు ఆదివారం దండేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నేతకాని మహార్ సంఘం రాష్ట్ర నాయకులు గోళ్ళ రాజమల్లు మాట్లాడుతూ ఆరిజిన్ డైరీ అధినేత ఆదినారాయణ రెడ్డి అగ్ర కులం అన్న అహంకారంతో అసత్య ఆరోపణలు చేస్తూ ఎమ్మెల్యేను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చిన్నాయన వేధించిన వారిపై చర్యలు తీసుకొని అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నేతకాని సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తాళ్లపల్లి రాములు, జాడి ఇసాకర్ టేకుమట్ల చంద్రయ్య, జాడి సత్యం పాల్గొన్నారు.

అనారోగ్యంతో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడి మృతి

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీలో గత 30 సంవత్సరలగా పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తున్న మిట్టపెల్లి సారయ్య(48) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కౌన్సిలర్ వంగ తిరుపతి, మున్సిపల్ సిబ్బంది మృతుని కుటుంభికులను పరామర్శించారు. మున్సిపాలిటీ నుండి దహన సంస్కారాలకు రూ.10,000 అందజేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుడు మరణించడం చాలా బాధాకరమని, అతడు మున్సిపాలిటీకి అందించిన సేవలుమరవలేనివని, వారి ఆత్మకు శాంతి కలగాలని కోరారు. మృతునికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బాసర



మండల కేంద్రంలోని సైలని బాబా దర్గా వద్ద ఆదివారం ఉర్సు ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా వద్ద ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. దర్గా తరఫున హైమద్ హుస్సేన్ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణరావు, పీఏసీఎస్ చైర్మెన్ వెంకటేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుధాకర్‌రావు, మాజీ సర్పంచ్ రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పదో తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని వడ్యాల ఉన్నత పాఠశాల 1991-92 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు ఒక్క చోట చేరి, ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకుని గురువులను సన్మానించారు. తమ బాల్యం తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుని, సరదాగా గడిపారు. ఒకరికి ఒకరు కష్టసుఖల్లో తోడుగా ఉండాలని ఆకాంక్షించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సన్మానించారు. రోజు అంతా ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు.

లాజికల్ థింకింగ్‌ని పెంపొందించుకోవాలి

- ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లాజికల్ థింకింగ్‌ని పెంపొందించుకొంటే భవిష్యత్తు బాగుంటుందని డాక్టర్ రవికిరణ్ యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ సైన్స్ క్యాంపు ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఈ వేసవిలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని తమ సబ్జెక్టులలో లాజికల్‌గా ఆలోచించి, నిర్ణయాలు తీసుకున్నట్లయితే ఉన్నత స్థాయికి ఎదుగుతారని సూచించారు. వేసవికాలంలో సమయాన్ని వృధా చేసుకోకుండా సమ్మర్ సైన్స్ క్యాంపులో శిక్షణ తీసుకున్న విద్యార్థులను అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో డీఎస్ఓ రఘురమణ, హెల్త్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు రమణాచారి, స్కూల్ ప్రిన్సిపల్ దేవేంద్ర పటాస్కర్, జనవిజ్ఞాన వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంతోష్, రవీందర్, కోశాధికారి శ్రీధర్ బాబు, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, గంగన్న, ఉమకాంత్, సంజీవరెడ్డి, నాగరాజు, లింగారెడ్డి సురేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ముధోల్

రైతులు వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మెన్ తీగల వెంకటేష్‌గౌడ్ అన్నారు. మండలంలోని వెంకటాపూర్, తరోడ, గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముధోల్, బాసర మండలాల్లో 13వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరి ఏ గ్రేడ్ క్వింటాల్‌కు ధర రూ.2060, బి గ్రేడ్ రూ.2040 ఉందని అన్నారు. రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అన్నారు. పీఏసీఎస్‌లో రైతుల కోసం నిరంతరం పనిచేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీ బండారి గంగాధర్, వెంకటాపురం సర్పంచ్ సాయినాథ్, నాయకులు రవికిరణ్‌గౌడ్, బోజేందర్, ఏయ్యాఖాన్, లతీఫ్, సాయిలు, రైతులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ ప్రతిమ గీసి అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ బదిలైన విషయం తెలిసిందే. జిల్లాలో పలు అభివృద్ధి పనులు చేస్తూ, ప్రజల మన్ననలు, ప్రజల హృదయాల్లో చోటు సంపాదించారని ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఆర్టిస్ట్ ద్యావంత్ రమేష్ అన్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న సందర్భంగా మర్యాదపూర్వకంగా ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో కలిశారు. కలెక్టర్ ప్రతిమని గీసీ వేసి కలెక్టర్‌కు బహుమానంగా అందజేశారు. ప్రతిమని చూసి ఆనందంతో అభినందనలు తెలియచేశారు

ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ కోర్సు కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేష్ పరీక్షను పర్యవేక్షించారు. నలంద కళాశాలలో జరిగిన పరీక్షకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 345 మంది దరఖాస్తులు చేసుకోగా 231 మంది హాజరయ్యారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మెరిట్ ఆధారంగా వంద మంది అభ్యర్థులను ఎంపిక చేస్తామని స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేష్ తెలిపారు. ఎంపికైన వారికి భోజనం, వసతితో పాటు ఉచిత పుస్తకాలను అందిస్తామని అన్నారు. ఆయా పోటీ పరీక్షలపై ఎంపికైన అభ్యర్థులకు జూన్ 1వ తేది నుంచి తరగతులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

జీఓనెం.3ను ప్రత్యేక ఆర్డినెన్సుతో పునరుద్ధరించాలి

- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబురావు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

గతంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కొట్టివేసిన జీఓ నెంబర్ 3ను ప్రత్యేక ఆర్డినెన్సుతో వెంటనే పునరుద్ధరించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, భద్రాచలం మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాశెట్టి మాధవరావు భవనంలో ఏర్పాటుచేసిన టాగ్స్ రాష్ట్ర కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా లెక్కల్లో ఆదివాసీలకు ప్రత్యేక కాలం ఏర్పాటుచేసి వారిని ప్రత్యేక మతంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక మతం ద్వారా ఆదివాసీలకు తమ సాంస్కృతితో పాటు వారికి రావలసిన అభివృద్ధి నిధులు స్పష్టమైన అవగాహనతో ఖర్చు చేయబడతాయని అన్నారు. అలాగే సుప్రీం కోర్టు గతంలో కొట్టివేసిన జీఓనెం.3ను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా మరో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీలకు ప్రాథమిక వసతి, ఇతర సౌకర్యాల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు పట్టాల విషయంలో స్పష్టమైన వైఖరి తెలియజేయాలని సూచిస్తూ, అర్హులైన ఆదివాసులకు వెంటనే పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్, దబ్బకట్ల లక్ష్మయ్య, సహాయ కార్యదర్శి భైరి సోమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు కోట శ్రీనివాస్, నెర్పెల్లి అశోక్, ఆత్రం తనుష్, గౌరీ నాగేశ్వర్ రావ్, రాష్ట్ర నాయకులు కుంజా శ్రీను, మడకం సతీష్ పాల్గొన్నారు.

తెలంగాణలో అధికారంలోకి రాబోయేది కాంగ్రెస్సే

- గడప గడపకు కాంగ్రెస్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కర్ణాటకలో ఏ విధంగా కాంగ్రెస్ విజయం సాధించిందో అదే విధంగా తెలంగాణలో కూడా అధికారంలోకి వస్తామని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని భగత్‌సింగ్ నగర్ కాలనీలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో పర్యటిస్తు, కాంగ్రెస్ హయంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత ప్రభుత్వాలు చేస్తున్న మోసాలను వివరిస్తు కరపత్రాలను అందించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇంటి నిర్మాణాకి రూ.5లక్షలు అందిస్తుందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ పెంచిన గ్యాస్ ధరలను నియంత్రిస్తు, ఐదు వందలకే గ్యాస్ ఇస్తామని అన్నారు. తెలంగాణ ఇచ్చింది ఎవరు.. అమరులు ఎవ్వరు అయ్యారనే అనే అంశంపై జూన్ 2వ తేదిన రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ ఒకటవ తేది వరకు 7661899899కు మిస్ కాల్ ఇచ్చి ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కర్ణాటకలో ఏ విధంగానైతే ప్రజలు సహకారించి కాంగ్రెస్‌ను గెలిపించారో అదే స్ఫూర్తితో తెలంగాణలో కూడా పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నగేష్, రాహుల్ ఉన్నారు.

నేతకాని సంక్షేమ సంఘం

కార్యవర్గంలో మండలవాసులకు చోటు





నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ నేతకాని, మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా కార్యవర్గంలో మండల వాసులకు చోటు లభించింది. శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్లో ఆ సంఘం సీనియర్ నాయకుడు దుర్గం శేఖర్ అధ్యక్షతన జరిగిన నేతకాని, మహర్ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశంలో గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన నేతకాని సంఘం సీనియర్ నాయకుడు డాక్టర్ బండారి రవీందర్, నేతకాని, మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, మండలంలోని తోషం గ్రామానికి చెందిన జునుగురు మహేష్‌ను ఆదిలాబాద్ జిల్లా నేతకాని, మహర్ సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్షునిగా రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్, స్టీరింగ్ కమిటీ చైర్మెన్ దుర్గం నర్సయ్య సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నియామక పత్రాలను అందజేసినట్లు ఆదివారం వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం చీఫ్ అడ్వైజర్ బోర్లకుంట దీపక్ కుమార్, రాష్ట్ర నాయకులు గోళ్ల రాజమల్లు, జాడి రాజిరెడ్డి, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దుర్గం సంతోష్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు దుర్గం రవీందర్ నేత, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సర్పే సోంబాయి పాల్గొన్నారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, సంఘం బలోపేతానికి తమ వంతుగా పూర్తి కృషి చేస్తామని రవీందర్, మహేష్‌లు పేర్కొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని డైట్ మైదానంలో జేసీ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో చేపట్టిన జూనియర్ ప్రీమియర్ లీగ్ పోటీలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సరదాగా బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. టైటాన్స్, చాలెంజర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మెమెంటో లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ ఐపీఎల్ తరహాలో క్రీడాకారులను ప్రోత్సహించేలా పోటీలను నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. క్రీడా రంగానికి తమ ప్రభుత్వం సైతం అధిక ప్రాధాన్యతను ఇస్తోందని గుర్తు చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహించాలని అన్నారు. క్రీడాకారులకు తన వంతుగా ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని భరోసా కల్పించారు. పట్టణంలో క్రీడా మైదానాలతో పాటు ఓపెన్ జిమ్‌లను ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఔత్సాహికులు వాటిని సద్వినియోగం చేసుకొని శారీరక దృఢత్వంతో పాటు పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జేసీ అకాడమీ నిర్వాహకులు జయేందర్ పటాస్కర్, ఇంద్రానిల్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, నాయకులు కుమ్ర రాజు, అయ్యుబ్, సంతోష్, కిషోర్, కరుణాకర్ పాల్గొన్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

బాసర : గోదావరి నదిలో ఆదివారం గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు ఏఎస్సై లక్ష్మణ్ తెలిపారు. స్థానికులు వీఆర్ఏ ఇచ్చిన సమాచారం మేరకు రెండో ఘాట్ నది తీరంలో మృతదేహం ఉన్నదని సమాచారం మేరకు గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీయించినట్లు తెలిపారు. మృతురాలి వయసు 55 సంవత్సరాలు లోపు ఉంటుందని, ఆకుపచ్చ రంగు చీర, మెరూన్ రంగు జాకెట్ ధరించి ఉన్నట్టు మరే ఇతర ఆధారాలు లభించలేదని ఏఎస్సై పేర్కొన్నారు. మిగతా వివరాలకు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గిరిగ్రామాల్లో భానుడి భగభగ..



నవతెలంగాణ-నార్నూర్

ఉమ్మడి మండలంలోని గిరిగ్రామాల్లోని ప్రజలు రోజు రోజుకు భానుడి భగభగతో ఎండ వేడిమికి అల్లాడిపోతున్నారు. ఆదివారం ఉష్ణోగ్రత తీవ్రత ఎక్కువ ఉండటంతో ఉట్నూర్ నుండి నార్నూర్ వెళ్లే ప్రధాన రహదారి ఉదయం నుండే రోడ్డు నిర్మానుష్యంగా మారింది. ప్రజలు బయట రావాలంటే ఎండ వేడిమికి జంకుతున్నారు. అత్యవసరముంటే తప్ప బయటికి రావడం లేదు. మరో పక్క అధికారులు కూలీలకు ఎండ తీవ్రతకు జాగ్రతలు పాటించే విధంగా అవగాహన కల్పిస్తున్నారు.

క్రీడల్లో విద్యార్థులు ముందుండాలి



నవతెలంగాణ-ముధోల్

విద్యార్థులు క్రీడల్లో ముందుండాలని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన 60మంది విద్యార్థులకు ఎమ్మెల్యే తన స్వంత డబ్బులతో టీషర్ట్‌లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తోందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లో రాణించాలని అన్నారు. జిల్లా స్థాయి ఆటల పోటీలో గెలుపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, సర్పంచ్ రాజేందర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-పెంబి

మండల కేంద్రంలో బస్టాండ్ దగ్గర గ్రంథాలయం ప్రక్కన భూక్యా జాన్సన్ నాయక్ యువసేన అధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. మండుటెండలో ప్రజల తహర్తిని తీర్చడానికి స్థానిక, పరిసర ప్రాంతాల నుండి పెంబి మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహర్తిని తీర్చేందుకు భూక్యా జాన్సన్ నాయక్ యువసేన అధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు వినియోగించుకోవాలని యువసేన సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా పలు మండలంలో భూక్యా జాన్సన్ నాయక్ యువసేన సభ్యులు చేపడుతున్న సేవలు చాలా అభినందనీయమని ఇలాంటి సేవ కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెంబి మండల నాయకులు బడుగు మల్లేష్, కొడగంటి నర్సయ్య, సుతారీ మహేందర్, గొధురి సరోజా, చెట్టి ధర్మేందర్, భీంరెడ్డి, అజయ్, ఖాన్, నవీన్, సతీష్. అహ్మద్ అలీ, బద్దయ్యా, గోధురి భూమేష్, గుండు శంకర్, ఆయా మండలాల నాయకులు కడెం జెడ్పీటీసీ సభ్యులు పురపాటి శ్రీనివాస్‌రెడ్డి, దిల్దర్‌నగర్ సర్పంచ్ పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన కిరణ్‌కు ఎమ్మెల్యే సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పూర్వ ప్రాథమిక విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు, సంస్కృతి ప్రభావం అంశంపై చేసిన పరిశోధనకు గానూ ఇటీవల డాక్టరేట్ పొందిన డైట్ వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్‌ను ఎమ్మెల్యే జోగురామన్న ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని కైలాస్‌నగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి ఆయనను శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించి అభినందనలు తెలియచేశారు. ఇటీవల సత్యసాయి విశ్వ విద్యాలయం డాక్టరేట్ పట్టాను జారి చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ చిన్న పిల్లల జీవన విధానం, తల్లితండ్రుల పాత్రపై కిరణ్ కుమార్ అధ్యయనం చేసి డాక్టరేట్ పట్టాను పొందారని అన్నారు. వారి కుటుంబ సభ్యులంతా ప్రస్తుతం ఉన్నత స్థానాలకు ఎదగడం హర్షనీయమని, వారిని స్ఫూర్తిగా తీసుకుంటూ మరింత మంది ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం శేఖర్, గంగారెడ్డి, రామ్‌కుమార్, కుమ్ర రాజు, తిరుపతి పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 22 మే 2023

కాసిపేట యూత్‌కి క్రికెట్ క్రీడా సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట



ఫ్రెండ్లీ పోలీస్ కార్యక్రమంలో భాగంగా కాసిపేట ఎస్సై గంగారాం, ఉప సర్పంచ్ పిట్టల సుమన్‌లు కాసిపేట యూత్‌కి ఆదివారం క్రికెట్ క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. రూ.7 వేలు విలువ చేసే క్రికెట్ బ్యాట్లు, వికెట్లు, బాల్స్‌లను ఎస్సై గంగారాం, రూ.10 వేల టీషర్ట్స్‌లను ఉప సర్పంచు సుమన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత చేడు వ్యసనాలకు లోను కాకుండా ఆటల్లో, చదువుల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువక్రీడాకారులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బదిలీ

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ బదిలీ అయ్యారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఆయనకు పోస్టింగ్ ఇస్తూ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులను జారీ చేశారు. అదనపు కలెక్టర్ రిజ్వాన్ భాషా అదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఎంతోగాను కృషి చేశారు. ఆయన హయాంలో జిల్లాకు పలు జాతీయ అవార్డులు రావడం జరిగిందని గుర్తు చేసుకుంటున్నారు. కాగా ఆయన 2021 ఆగస్టు 26న అదనపు కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించాడు. దాదాపు 20 నెలలకు పైగా జిల్లా ప్రజలకు తన సేవలను అందించాడు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-సారంగాపూర్

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సొసైటీ చైర్మెన్ ఐరా నారాయణరెడ్డి, అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు, జామ్, యకర్‌పల్లే, జౌలి, గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్, రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఆదేశానుసారం రైతులకు ఇబ్బంది కలగకుండా వరి కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, క్వింటాలుకు మొదటి రకం రూ.2060, రెండో రకం ధాన్యానికి రూ.2040 ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడెల్లి ఆలయ చైర్మెన్ అయిటి చందు, ఎఎంసీ చైర్మెన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డిలు నాయకులు రాజ్ మహమ్మద్, మాధవ్‌రావు, ఆయ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సీఈఓ సలీం సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణలో భాగస్వామ్యులు కావాలి

- జిల్లా డిప్యూటీ వైద్యాధికారి సుధాకర్ నాయక్
- అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎయిడ్స్ నివారణలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా డిప్యూటీ వైద్యాధికారి సుధాకర్ నాయక్ తెలిపారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ దినోత్సవం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జిల్లా 30వ స్థానంలో ఉందని తెలిపారు. జిల్లాలో 2008 నుండి 2024 వరకు 1,54,098 మంది స్వచ్ఛందంగా పరీక్షలు నిర్వహించగా 678 మందికి హెచ్ఐవీ సోకినట్లు నిర్ధారించినట్లు తెలిపారు. హెచ్ఐవీ సోకిన వారిని అంటరానివారిగా చూడకూడదని సూచించారు. గతలో డబ్ల్యూహెచ్‌ఓ ఇచ్చిన నినాదం ప్రకారం భాగస్వామ్యంతో బాధ్యత నిర్వహిద్దామని హెచ్ఐవీ సోకిన వారి పట్ల సంఘీభావంతో మెలుగుదామని తెలిపారు. హెచ్ఐవీ వైరస్‌తో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ సతీష్, ల్యాబ్ టెక్నీషియన్ రఫీ, చేతన ఎన్జీఓ ప్రోగ్రాం మేనేజర్ తోట సతీష్, శ్రీసాయి మహిళా మండలి ప్రోగ్రాం మేనేజర్ ఈర్ల సునీల్, జీవనధార బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ రాజేష్, టీఐ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి పెద్ద పీట



నవతెలంగాణ-ముథోల్

తెలంగాణ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. దేవాదాయ శాఖ మంజూరు చేసిన రూ.10లక్షలతో మండల కేంద్రంలో నిర్మించిన మార్కండేయ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రతి గ్రామంలో ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేను, స్థానిక నాయకులను పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక రమణ, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు అఫ్రోజ్ ఖాన్, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ రాజేందర్, ముథోల్ టౌన్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు నర్సయ్య, ఆయా గ్రామాల పద్మశాలి సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ కుమారుడి వివాహానికి హాజరైన ప్రముఖులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎంపీ సోయం బాపూరావు కుమారుడు సోయం వెంకటేష్ వివాహం పద్మనాయక గార్డెన్‌లో ఆదివారం జరిగింది. ఈ వివాహానికి ప్రముఖులు, రాజకీయ నాయకులు హాజరయ్యారు. ఈ వేడుకల్లో ఏర్పాటు చేసిన ఆదివాసుల నృత్యాలు, పాటలు అలరించారు. కాగ్ ప్రముఖ వీఐపీలు వివాహానికి హాజరు కావడంతో జిల్లా పోలిస్ యంత్రాంగం గార్డెన్ వద్ద భారీ పోలీసు బందోబస్తు చేపట్టింది. కాగా ఈ వివాహ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ రేగ కాంతారావు, ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్‌లు రాహుల్ రాజ్, వరుణ్‌రెడ్డి దంపతులు, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, జోగు రామన్న, రాథోడ్ బాపురావు, కోనేరు కోనప్ప, నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి, డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు సుహాసినిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు కార్యకర్తలు అభిమానులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

రాజీవ్‌గాంధీ హాయంలోనే ఐటీ రంగం అభివృద్ధికి కృషి



ఆదిలాబాద్‌టౌన్‌లో...

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారతదేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అభివృద్ధికి రాజీవ్‌గాంధీ కృషి చేశారని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కైలాస్‌నగర్‌లో గల ప్రజాసేవా భవన్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసిందని గుర్తు చేశారు. ఈ కుటుంబాన్ని దేశం మరువదని అన్నారు. వారి స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చి ఆ మహనీయుడికి అంకితం చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్, అల్లూరి అశోక్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కిష్టారెడ్డి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదానం

భారత దేశానికి సాంకేతికత అందించిన మహనీయుడు మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ అని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత అన్నారు. ఆదివారం రాజీవ్ గాంధీ 32వ వర్ధంతిని పురస్కరించుకొని రిమ్స్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం చేసిన యువతను ప్రోత్సహిస్తు, పండ్ల రసం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి సాంకేతికను అందించి ఒక గుర్తింపు తీసుకువచ్చిన ఘనత స్వర్గీయ రాజీవ్ గాంధీదని తెలిపారు. రిమ్స్‌కు వచ్చే ఆదివాసులకు సరైన సమయంలో రక్తం అందక పడుతున్న ఇబ్బందులను గమనించి, రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. అనేక సంస్కరణలతో రాజీవ్ గాంధీ ప్రధానిగా కొనసాగిన సమయంలో గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు. కానీ ప్రస్తుత పాలనలో గుర్తింపు కాదుగా దిగజారే విధంగా అప్పుల పాలు చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు చరణ్‌గౌడ్, రూపేష్‌రెడ్డి, చంద్రాల రాహుల్, అజీజ్ పాల్గొన్నారు.

ఇచ్చోడ : మాజీ దేశ ప్రధాని రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి వేడుకలు ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి డేగల భీమన్న మాట్లాడుతూ భారతదేశ ప్రధానిగా, సైన్స్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు ఎప్పటికీ మర్చిపోలేనివని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు తనకంటూ ప్రత్యేకమైన ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ బోథ్ నియోజకవర్గం అధ్యక్షులు కొత్తూరు లక్ష్మణ్, మజీద్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : రాజకీయ నాయకులకు, యువతరానికి రాజీవ్ గాంధీ ఆదర్శప్రాయుడని విలువలకు కట్టుబడిన మహోన్నత వ్యక్తి అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొక్కిరల విశ్వప్రసాద్ రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 32వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి రాజకీయాల్లో విలువలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. విలువలకు కట్టుబడిన గొప్ప వ్యక్తి రాజీవ్ గాంధీ అని కొనియాడారు. నేటి నాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగినట్లయితే రాజకీయాల్లో ఉన్నతంగా రాణించగలరని అన్నారు. మన దేశంలో అతిచిన్న వయస్సులో ప్రధాన మంత్రి పదవిని చేపట్టిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కిందనీ కొనియాడారు. అలాగే ఆయన చేసిన అభివృద్ధి పనులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యురాలు మర్సుకోల సరస్వతి, నాయకులు మురళి, శ్రావణ్ పాల్గొన్నారు.

జన్నారం : దివంగత మాజీ ప్రధానమంత్రి, భారత రత్న రాజీవ్ గాంధీ 32వ వర్ధంతినీ మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ జీవితం ఈ దేశ యువతకు ఎంతో ఆదర్శప్రాయం అన్నారు. నేటి హైటెక్ యుగానికి ఆద్యుడు రాజీవ్ గాంధీ అని, చిన్న వయసులోనే దేశం అత్యంత సర్వోన్నత పీఠాన్ని అధిరోహించిన నాయకుడు భారత దేశ దార్శనికుడు అని కొనియాడారు. రాజీవ్ గాంధీ పాలనను దేశ హైటెక్ యుగానికి నాందిగా భావిస్తారని అన్నారు. రాజీవ్ గాంధీ ఇందిరమ్మ మరణంతో తప్పనిసరి పరిస్థితుల్లో రాజకీయ రంగ ప్రవేశం చేసి చరిత్రలోనే లికించ దగ్గ విజయాలను అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్మెంట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వినోద్ నాయక్, మండల అధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శి ఫసీ ఉల్లా, రేండ్లగూడ ఎంపీటీసీ దాముక కరుణాకర్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి హేమంత్ చారి, పట్టణ అధ్యక్షుడు దుమల్ల రమేష్, బీసీ సెల్ అధ్యక్షుడు బీనవేని రాజన్న యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇందయ్య, సీనియర్ నాయకులు తాటికొండ శ్రీనివాస్, నర్సింగ్ రావు, వార్డు సభ్యుడు గంగన్న యాదవ్, రేండ్లగూడ, బాధంపెల్లి గ్రామ అధ్యక్షుడు అల్లం పెద్దయ్య, రమేష్ గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

దేశ ప్రజలకు ప్రధాని క్షమాపణ చెప్పాలి..

దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణ. చెప్పాలని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్మెంట్ రాష్ట్ర కన్వీనర్ వినోద్ నాయక్ డిమాండ్ చేశారు. రూ.2000 నోటును రద్దు చేస్తూ ఆర్బీఐ, ప్రకటించడంపై నిరసన వ్యక్తం చేస్తూ వారు ఆదివారం జన్నారం మండల కేంద్రంలో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నోట్ల రద్దుతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే, ప్రధాని తుగ్లక్ పాలన చేస్తున్నారన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల కష్ణ ఆధ్వర్యంలో భారతదేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 32వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి ఎనలేని సేవాలందించారని, ఆధునిక భారత దేశం కోసం ఆయన శ్రమించారని, దేశ రాజకీయాలలో యువత పాత్ర ఎంతో కీలకమని చాటి చెప్పి గొప్ప వ్యక్తిఅని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సిద్ధం తిరుపతి, ఎంపీటీసీ భీంరావు, కనుకుల రాకేష్ పాల్గొన్నారు.

దండేపల్లి : రాజీవ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన తిట్టదానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి మాట్లాడుతూ దేశానికి సాంకేతికతను తీసుకువచ్చింది రాజీవ్ గాంధీనేనని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి కంది సతీష్, యువత అధ్యక్షుడు ఆకుల దుర్గాప్రసాద్, ఎంపీటీసీ బొడ్డు కమలాకర్, నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్, ప్రేమ్ చంద్, కాంతారావు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో...



జన్నారంలో...

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటే : బండి సంజయ్

- బీజేపీ అధికారంలోకి రాబోతోంది
- కర్నాటక ఫలితాలకు, తెలంగాణకు సంబంధం లేదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ ఒకటేనని అన్నారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు దోచుకుందని, ఇప్పుడు బీఆర్ఎస్ దోచుకుంటుందని అన్నారు. బీఆర్ఎస్ కాంగ్రెస్ ఒకటేనని రాబోయే ఎన్నికల్లో కలిసి పోటీ చేయనున్నారని ఆరోపించారు. కానీ బీజేపీ మాత్రం సింగిల్‌గా పోరాడుతుందని అన్నారు. హైదరాబాద్ కొకపేట భూముల కేటాయింపు ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. కోకాపేట భూమి మీ అయ్యా జాగీరు అనుకున్నారని ప్రశ్నించారు. ఆ ప్రాంతంలో గజం లక్షకుపైగా పలుకుతుంటే రూ.7,500 చొప్పున 11 ఎకరాల భూమిని బీఆర్ఎస్ పార్టీకి ఎట్లా కట్టబెడతారని అన్నారు. వాస్తవానికి ఓపెన్ మార్కెట్‌లో కోకాపేటలో ఎకరం ధర వంద కోట్ల రూపాయలకు పైగా పలుకుతోందని అన్నారు. ఈ లెక్కన బీఆర్ఎస్‌కు కట్టబెట్టిన భూముల విలువ రూ.1100 కోట్ల పైమాటేనని అన్నారు. అదే ప్రాంతంలో సర్కారు భూమిని హెచ్ఎండీఏ అధికారులు గజానికి లక్ష పదివేలకు చొప్పున మార్కెట్‌లో అమ్మకానికి పెడుతూ ఈరోజు పత్రికల్లో నోటిఫికేషన్ ఇచ్చారు. మరి అదే ప్రాంతంలో రూ.550 కోట్ల విలువైన భూమిని రూ.40 కోట్లలోపే బీఆర్ఎస్ పార్టీకి ఎట్లా కట్టబెడతారంటూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భూమిని ధారాదత్తం చేసుకునేందుకు ప్రత్యేకంగా కేబినెట్ మీటింగ్ పెట్టి ఆమోదించుకున్నారని అన్నారు. అయినప్పటికీ మీడియాకు మాత్రం ఈ వివరాలను వెల్లడించకుండా రహస్యంగా దాచి ప్రజల ఆస్తులను కొట్టేశారని మండిపడ్డారు.

బాసర క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం



నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవి అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాల నుండే కాక మహా రాష్ట్ర నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుండి భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి నది తీరాన గల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు చిన్నారులు అమ్మవారి దర్శన అక్షరాభ్యాస క్యూలైన్లు బారులు తీరారు. అమ్మవారి అక్షరాభ్యాస మండపాలలో భక్తులు తమ చిన్నారులకు ఆలయ అర్చకులచే ప్రత్యేక అక్షరాభ్యాస పూజలు జరిపించి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి అన్నదాన సత్రంలో భక్తులకు ఆలయం తరఫున ఉచిత అన్నదాన ప్రసాద వితరణ చేశారు. అక్షరాభ్యాస పూజలు లడ్డు ప్రసాదాల విక్రయాల ద్వారా ఆలయానికి రూ.13లక్షల వరకు ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా యువత బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక ఖానాపూర్ వార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఆ పార్టీలో చేరారు. వారికి మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ 2014 కంటే ముందు పట్టణంలో ఉన్న పరిస్థితులు ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను బేరీజు చేసుకోవాలని అన్నారు. గతంలో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే వారని అన్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో నేడు అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఖానాపూర్ వార్డులోనూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు గుర్తు చేశారు. సమగ్ర అభివృద్దే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించిన ప్రభుత్వం వారి ఆరోగ్య సంరక్షణతో పాటు ఆడబిడ్డ పెళ్లి నుండి, వితంతు పింఛన్లు, వృద్ధాప్య పింఛన్లు, ఉన్నత విద్యకు ఆర్థిక సాయం అందిస్తున్న ఘనత కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. మాయమాటలు చెప్పే బీజేపీ పార్టీ కంటే, ప్రజల కష్టాల్లో సంక్షేమ పథకాలతో అండగా ఉంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికే ప్రజలు మద్దతు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, కోఆప్షన్ సభ్యులు ఎజాజ్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కి సన్మానం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం ఎంపీ సోయం బాపూరావు కుమారుని వివాహ వేడుకకు హాజరై తిరుగు ప్రయాణంలో నిర్మల్ జిల్లా కేంద్రానికి చేరుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ని మండల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. బీజేపీ అధికారంలోకి రావడానికి చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సురకంటి ముత్యంరెడ్డి, వెంకట్‌రెడ్డి, సరికేల గంగన్న, రాజేశ్వర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.